## క్లుప్తంగా

### టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**విజయవాడ కల్చరల్:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో భక్తులకు అన్నప్రసాదం అందించారు. అన్నప్రసాద దాతలు చిన్మయి, ఉదయ్, సృజనలు పంపిణీ కార్యాక్రమంలో పాల్గొన్నారు. కల్యాణమండపంలో కొలువైవున్న పద్మావతి సమేత శ్రీనివాసునకు అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి నిర్వహించారు.

### నేత్ర పర్వంగా కూచిపూడి నృత్యాలు



**విజయవాడ కల్చరల్:** దృశ్యవేదిక ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నాట్యాచార్యుడు చదలవాడ ఆనంద్ బృందం ప్రదర్శించిన అంశాలు నేత్ర పర్వంగా సాగాయి. వినాయక కౌత్వం, ఆనంద తాండవం, రామాయణ శబ్దం, దశావతార శబ్దం, వచ్చెను అలివేలుమంగ అంశాలను సీహెచ్ నాద కీర్తిక, అమృత వర్షిణి, జయ సాత్విక, పవన ప్రత్యూష, అశ్వితి, సిద్ధ, రష్మిక, పావని, మీనాక్షి, భవ్యశ్రీలు నృత్యాలను అభినయించారు. ఉదయ్ భాగవతుల రచించి దర్శకత్వం వహించిన సాహితీ సూక్తం సాంఘిక నాటికను ప్రదర్శించారు.

### కళాకారులు సాంస్కృతిక వారధులు



**విజయవాడ కల్చరల్:** కళాకారులు సాంస్కృతిక వారధులని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు తెలిపారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం సినీ సంగీత విభావరి, గాయకుడు మేకల పురోషత్తమ ప్రసాద్‌కు బహుగళ కళానిధి పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయకుడు ప్రసాద్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు సంస్థ లక్ష్యాలను వివరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. పురుషోత్తమ ప్రసాద్‌కు బహుగళ కళానిధి పురస్కారం అందించారు.

### వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కమిటీ నియామకం

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ క్లస్టర్ -2 కమిటీ నియామకం జరిగింది. క్లస్టర్ -2 కమిటీ ఉపాధ్యక్షులుగా జవ్వాది ఆదిరెడ్డి, గుల్ల సాంబయ్య, ప్రధాన కార్యదర్శులుగా దాసరి చిన్నారావు, బోనం నాగు, కృత్తివెంటి చంద్రశేఖర్, కోశాధికారిగా రావి చెన్నారెడ్డి, కార్యదర్శులుగా అంగిరేకుల సాయి, షేక్ నాగుర్‌వలి, ఎండీ అమానుల్లా షరీఫ్, పొన్నలూరి సనత్‌కుమార్, పుప్పాల దుర్గాప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సామాల శ్రీనివాస రెడ్డి, సామంతకూరి దుర్గారావు, పినగాడి ముత్యాలు, కనుముల శ్రీనివాసరావు, పాలకోటి రాజేష్, మొదలి కృష్ణమోహన్, అరుగు శ్రీనివాస్, తాడేపల్లి శ్రీనివాసమూర్తి, సనపతి ఈశ్వర్‌రావు, కనుకు రాంబాబు, యేకుల లక్ష్మయ్య, జెర్రిపోతుల దుర్గారావు, నెల్లి గోవింద నాయుడు, మల్లవరపు కళ్యాణ్, కొండ ప్రభుదాసు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

### కోడి పందేల శిబిరాలపై దాడి

**పాయకాపురం(విజయవాడరూరల్):** నున్న పోలీసు స్టేషన్ పరిధిలోని రెండు గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై టాస్క్ ఫోర్సు పోలీసులు ఆదివారం మెరుపు దాడులు చేశారు. పి.నైనవరం గ్రామ సరిహద్దులో కోడి పందేలు వేస్తున్న 16 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.16,240 నగదు స్వాధీనం చేసుకొన్నారు. అదే విధంగా పాతపాడు గ్రామ శివారు మామిడి తోటలో కోడి పందేలు వేస్తుండగా టాస్క్ ఫోర్సు పోలీసులు దాడి చేసి 15 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,59,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు గ్రామాల్లో లభించిన కోడిపుంజులను, నగదు, పందేలు వేస్తున్న వారిని టాస్క్ ఫోర్సు పోలీసులు నున్న పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తవ్వారు సరే.. పూడ్చేదెవరు?



దావు బుచ్చయ్యకాలనీలో దుస్థితి



దుర్గాపురం రామాలయం సమీపంలో

- సహనాన్ని పరీక్షిస్తున్న వాటర్ వర్క్స్, యూజీడీ పనులు
- రాకపోకలకు తప్పని తిప్పలు
- నత్తనడకన సాగుతున్న పనులు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** నగరంలో వాటర్ వర్క్స్, యూజీడీ పనుల కోసం రోడ్లు తవ్వేస్తున్నారు. దుర్గాపురం, బావాజీపేట, శ్రీనగర్ కాలనీ, జీపీఆర్‌నగర్, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, ముత్యాలంపాడు, అయోధ్య నగర్ తదితర ప్రాంతాల్లో వాటర్ వర్క్స్, యూజీడీ పనులు కొనసాగుతున్నాయి. అయితే తవ్విన రోడ్డును మాత్రం సరిచేయటం లేదు. దీంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు నానా యాతన పడుతున్నారు. తరచూ గోతులలో పడి గాయాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**అధికారుల మధ్య సమన్వయ లోపం....**

రోడ్డును తవ్వి పనులు చేయటంపై చూపిస్తున్న శ్రద్ధ రోడ్డును సరిచేయటంలో చూపించటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే తాము రోడ్డు వేశామని ఇప్పుడు తవ్వితే మరోమారు రోడ్డు ఎలా వేస్తామని అంటున్నారని వాపోతున్నారు. తవ్విన రోడ్లు, గోతులను వెంటనే సరిచేయాలని ఎన్ని మార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్ని విభాగాల సిబంది సమన్వయంతో పనిచేసి పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. తవ్విన రోడ్డును గోతులను సరిచేసిన తరువాతే మరోచోట రోడ్డు తవ్వాలని కోరుతున్నారు.



బావాజీ పేటలో బురదమయంగా రోడ్డు

**నత్తనడకన పనులు.....**

నగరంలో జరుగుతున్న వాటర్ వర్క్స్, యూజీడీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోజులు గడుస్తున్నా పనులు పూర్తి కావటం లేదు. దీంతో వర్షాలకు గోతులు నిండి పోవటంతో పనులలో జాప్యం జరుగుతుంది. వేసవి కాలంలో చేయాల్సిన పనులు వేసవి ముగిసిన తరువాత వర్షాకాలంలో చేయటం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలోనే పనులు పూర్తిచేసి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదని అంటున్నారు.

**బురదగా మారుతున్న రోడ్లు, మలుపులు**

పైపులైన్ పనులు కోసం రోడ్డును తవ్వి పనులు పూర్తికాకపోవటంతో వర్షాలకు రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. ముఖ్యంగా మలుపు ప్రాంతాల్లో రోడ్డుపై మట్టి బురదగా మారి వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. గుంతల్లో వర్షపునీరు నిలిచిపోయి దోమలకు ఆవాసకేంద్రంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి పైపులైన్ పనులను వేగవంతం చేసి తవ్విన రోడ్లు, గోతులను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

# కోలాహలంగా బోనాలు





బోనాలు తీసుకొస్తున్న భక్తులు



బోనాలతో నృత్యాలు చేస్తున్న మహిళా భక్తులు



ఆషాఢమాసం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మకు హైదరాబాద్‌లోని భాగ్యనగర్ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం బంగారు బోనాన్ని సమర్పించింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పోతురాజు విన్యాసాలతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో ఆనందోత్సాహాలతో ఉండాలని అమ్మవారిని పూజించారు. జగన్మాతకు జేజేలు పలుకుతూ భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





డప్పుల బృందం ప్రదర్శన



వాయిద్యాలతో నృత్యం చేస్తున్న మహిళ

## పూర్తయిన ఆక్రమణల తొలగింపు

- దేవస్థాన స్థలం చుట్టూ ఫెన్సింగ్
- రథం సెంటర్‌లో దేవస్థాన కౌంటర్లు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పరిసరాల్లో ఆక్రమణల తొలగింపు పక్రియ ఆదివారం తెల్లవారుజాము ఐదు గంటలకు పూర్తయింది. కనకదుర్గనగర్ నుంచి రథంసెంటర్ వరకు దేవస్థాన స్థలంలో ఆక్రమణలతోపాటు చైనావాల్, విజయేశ్వరస్వామి వారి ఆలయం, కనకదుర్గనగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, బడ్డీలను తొలగించారు. మరో వైపున రథం సెంటర్ వరకు ఉన్న దేవస్థాన స్థలం తిరిగి ఆక్రమణలకు గురికాకుండా ఐరన్ గడ్డర్లతో కూడిన ఐరన్‌మెస్ ఏర్పాటు చేశారు. మరో వైపున కనకదుర్గనగర్ పరిసరాల్లోని దుకాణాలను నిర్వహిస్తున్న మహిళలు, చిరువ్యాపారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఆలయం వద్దకు చేరి ఆందోళన నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సుమారు 30 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

**రథంసెంటర్ వద్ద దేవస్థాన కౌంటర్లు**

రథం సెంటర్‌లోని దేవస్థాన స్థలంలో కౌంటర్ల ఏర్పాటుకు ఆలయ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అమ్మవారి దర్శన టికెట్లతోపాటు ఆర్జిత సేవా టికెట్లు, ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేసి సేవలను భక్తులకు మరింత చేరువ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



ఆక్రమణల తొలగింపు అనంతరం వ్యర్థాలను తరలిస్తున్న దేవస్థాన సిబ్బంది

**మంత్రి దృష్టికి ఆక్రమణల తొలగింపు..**

ఆక్రమణల తొలగింపు విషయాన్ని ఆలయ ఈవో శీనానాయక్ ఆదివారం ఇంద్రకీలాద్రికి విచ్చేసిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో ఆక్రమణలు ఉన్న సమయంలో ట్రాఫిక్ ఇబ్బందిలతో కూడిన వీడియో పుటేజీ, ప్రస్తుతం ఆక్రమణల తొలగించిన తర్వాత ట్రాఫిక్ పరిస్థితికి సంబంధించిన వీడియోలను మంత్రికి చూపించారు. ఆక్రమణల తొలగింపుతో కేవలం పదిశాం పనిమాత్రమే పూర్తయిందని, ఇంకా 90 శాతం పనులు మిగిలి ఉన్నాయన్నారు. దసరా నాటికి కనకదుర్గనగర్ నుంచి రథంసెంటర్ వరకు ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకుని కీలక మార్పులు చేయనున్నట్లు మంత్రికి, ఈవో వివరించారు.

## నేర ప్రవృత్తి మార్చుకోవాలి

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** నేరస్తులు నేర ప్రవృత్తి మార్చుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను హెచ్చరించారు. గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నేరస్తులు, రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. నేరం చేసిన వారు పోలీసుల నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నారు. నేరస్తులు తీరుమార్చుకుని సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. ఎక్కడైనా నేరం జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ రైటర్ సంతోష్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓంకార్ ఆశయాలు సాధించాలి



**కృష్ణలంక(విజయవాడ తూర్పు):** దేశంలో సామాజిక న్యాయం కమ్యూనిస్టుల ఐక్యతే కర్తవ్యంగా మాజీ ఎమ్మెల్యే ఓంకార్ ఆశయాలు సాధించాలని ప్రొఫెసర్ మార్క్ శంకర్ నారాయణ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఎంసీపీఐ (యు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కార్మికవర్గ అగ్రగామి దళం, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణకర్త, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా వర్తమాన రాజకీయ పరిస్థితులు-కమ్యూనిస్ట్ ఉద్యమ ఐక్యత-సామాజిక న్యాయం-కర్తవ్యాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మార్క్ శంకర్ నారాయణ, ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా మార్క్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓంకార్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అదే ఆయనకు మనమిచ్చే నిజమైన ఘన నివాళులన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మత ఉన్మాదులు ఏ రూపంలో ఉన్న వ్యతిరేకంగా పోరాటం చేయాలని తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను ఎప్పటికప్పుడు గ్రహించి ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జెల్లీ విల్సన్, తెలంగాణ ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యకార్శి గాదగోని రవి, సీపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాల హాస్టల్ తనిఖీ



**లబ్బీపేట(విజయవాడతూర్పు):** ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థినుల హాస్టల్‌ను ఆదివారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అవసరమైన సౌకర్యాలు, డైనింగ్ హాల్, వాటర్ సౌకర్యం, సెక్యూరిటీ వంటి పలు అంశాలను పరిశీలించారు. డైనింగ్ హాల్‌లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్నా, ఏ సమయంలోనైనా తన దృష్టికి తేవాలని కోరారు. హాస్టల్స్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అకడమిక్ యాక్టివిటీస్‌లో యాక్టివ్‌గా ఉండాలని తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** మధురానగర్ విద్యుత్ సెక్షన్ 11 కేవీ దేవినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు పి. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవినగర్ 1వ లైన్ నుండి 5 వ లైన్ వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** అలంకార్ సబ్ స్టేషన్ 11 కేవీ గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర రత్న రోడ్డు, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, నగ్రావారివీధి, గల్లావారివీధి, హిందీ స్ట్రీట్. గరికపాటివారి వీధి, జ్ఞానో లీవ్ స్ట్రీట్, ఫిల్మ్ చాంబర్ స్ట్రీట్, అన్నపూర్ణ రోడ్డు, జమీందారు స్ట్రీట్, సన్యాసిరాజు స్ట్రీట్, రైల్వే స్టేషన్ రోడ్డు, గాంధీనగర్, సాంబమూర్తి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## తెలుగు సాహిత్యానికి వైభవోపేతమైన చరిత్ర

**విజయవాడ కల్చరల్:** తెలుగు సాహిత్యానికి వైభవోపేత మైన చరిత్ర ఉందని అఖిల భారతీయ సాహిత్య పరిషత్ స్థానిక ప్రతినిధి కె.ఓంకార నరసింహం అన్నారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సాహిత్య సంచిక కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురంలోని విజ్ఞాన విహార పాఠశాలలోని సమావేశ మందిరంలో సాహిత్య సౌరభాలు సమాలోచన కార్యక్రం ఆదివారం నిర్వహించారు. సభను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గొప్ప సాహిత్యం అందరికీ చేరాలన్నారు. తెలుగు సాహిత్యానికి అనంతమైన చరిత్ర ఉందని చెప్పారు. సాహిత్యం సమాజంలో భాగస్వామి కావాలని సూచించారు. విద్యావేత్త బీఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ తొలి నాళ్ళలో పద్య కవిత్వం కనిపించేదని కాలానుగుణమైన మార్పులతో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. డాక్టర్ సశ్రీ మాట్లాడుతూ సాహిత్యం నేటి తరానికి చేరువ కావాలని సూచించారు. డాక్టర్ కావూరి సత్యవతి, డాక్టర్ బాలకృష్ణ, పొన్నాడ సూర్యప్రకాశరావు, ఎం.నాగలక్ష్మి, ఐ.నాగభూషణం, మూర్తి తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలు అంశంగా ప్రసంగించారు. యువ సంగీత కళాకారుడు వై. దీక్షిత్ మురారి వేణువుపై సంప్రదాయ కీర్తనలు పలికించారు.



సాహిత్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఓం కార నరసింహమూర్తి, వేదికమీద సశ్రీ, నాగలక్ష్మి

## మహాప్రస్థానం కవితా సంపుటి పెను సంచలనం

**విశ్రాంత కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్**

**విజయవాడ కల్చరల్:** ప్రజాకవి శ్రీశ్రీ అని విశ్రాంత కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి శ్రీశ్రీ సాహిత్యనిధి ఆధ్వర్యంలో న్యాయవాది వేములపాటి పట్టాభికి ఆత్మీయ సత్కారం, శ్రీశ్రీ మహాప్రస్థానం గ్రంథాల బహూకరణ కార్యక్రమాన్ని ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో వేములపాటి అనంతరామయ్య కళావేదికమీద నిర్వహించారు. ఇంతియాజ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మహాప్రస్థానం కవితా సంపుటి పెనుసంచలనం కలిగించిందని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ శ్రీశ్రీకి అంతరంగిక శిష్యులు కొంతమంది ఉన్నారని వారిలో వేములపాటి అనంతరామయ్య ఒకరన్నారు. శ్రీశ్రీ సాహిత్య నిధి నిర్వాహకుడు సింగంపల్లి అశోక్ కుమార్ శ్రీశ్రీ సాహిత్యాన్ని అభిమానులకు అందిస్తున్నట్లు తెలిపారు. సింగంపల్లి అశోక్‌కుమార్ శ్రీశ్రీ సాహిత్యపు విలువలు అంశంగా ప్రసంగించారు. న్యాయవాది వేములపాటి పట్టాభిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. న్యాయవాది మోహన్ రాంప్రసాద్ మహాప్రస్థానం గీతాన్ని గాయకుడు సుదర్శన్ రాజు శ్రీశ్రీ సినిమా పాటలను ఆలపించారు. గ్రంథాలయానికి శ్రీశ్రీ నిలువెత్తు మహాప్రస్థానం పుస్తకాన్ని అందించారు.



నిలువెత్తు పుస్తకాన్ని అందిస్తున్న నిర్వాహకులు

## శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన గోష్టిగానం



ఘనరాగ పంచరత్న కీర్తనలు గానం చేస్తున్న కళాకారులు

**విజయవాడ కల్చరల్:** సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వర్ధంతుల సందర్భంగా శిష్య ప్రశిష్య బృందం ఆధ్వర్యంలో దుర్గాపురంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో ఆదివారం నిర్వహించిన ఘనరాగ పంచరత్న కీర్తనల గోష్టిగానం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. ఆకాశవాణి టాప్ గ్రేడ్ విద్వాంసులు మోదుమూడి సుధాకర్ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ పంచరత్నకీర్తలు జగదానంద కారక నాటరాగం, దుడుకుగల గౌళరాగం, సాధించెనే ఆరభి రాగం కనకన రుచిరా వరాళి రాగం, ఎందరో మహానుభావులు శ్రీ రాగంతో 100 మంది సంగీత విద్వాంసులు ఏకకాలంలో ఆలపించారు. అంజానా సుధాకర్, పోపూరి గౌరీనాథ్, భమిడిపాటి శ్రీలలిత, డీవీకే వాసుదేవన్, బీవీ దుర్గాభవాని, అన్నవరపు రామస్వామి, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. సంగీతోత్సవాలలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు సద్గురువులకు సంగీత నీరాజనాలు అందించారు.